# జంబుకేశ్వరం

## సర్వం శ్రీసాయి సేవా ట్రస్ట్

Regd. 192/2019



## జంబుకేశ్వరంలో జంబుకేశ్వరుని గురించి తెలుసుకుందాం:-

తిరువనైకావల్, తిమేవకాయ్ అనే పేర్లు కూడా ఉన్నాయి. వీటి ప్రకారం ఇక్కడ ఏనుగుల చేత పూజలందుకొన్న క్షేత్రం అని అర్థం. పూర్వం ఇక్కడ అధికంగా జంబు వృక్షాలు ఉండడం వల్ల దీనికి జంబుకేశ్వరం అని పేరు వచ్చింది. జంబు వృక్షాలంటే తెల్లనేరేడు వృక్షాలు. దేశంలోని పంచభూత క్షేత్రాలలో ఇక్కడ కొలువై ఉన్నది జల లింగం కాగా మిగతావి... చిదంబరం (ఆకాశలింగం), కాంచీపురం (భూ లింగం), శ్రీ కాళహస్తి (వాయులింగం), తిరువన్నామలై (అగ్ని లింగం). వీటిలో మనరాష్ట్రంలోని శ్రీకాళహస్తి కాకుండా పంచభూత క్షేత్రాల్లోని మిగతా నాలుగు తమిళనాడులోనే ఉండడం గమనార్హం. ఈ క్షేత్రం స్థల పురాణ విషయానికి వస్తే... ఇక్కడ స్థల పురాణం పై రెండు కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి.

మొదటి ఇతిహాసం...మొదటి కథ ప్రకారం ఇక్కడ శంభుడు అనే ఋషి నివసిస్తుండేవాడు. ఆ ఋషి అత్యంత శివభక్తుడు. శివుడిని పూజించందే మంచినీరు కూడా స్వీకరించేవాడు కాదు. అలా కాలం గడుస్తుండగా ఒకసారి శంభుడికి శివుడిని ప్రత్యక్షంగా పూజించాలని కోరిక కలిగింది. ఆ విధంగా శివుడిని

ప్రసన్నం చేసుకోవడానికి తపస్సు చేయనారంభిం చాడు. శివుడు అతని తపస్సుకి మెచ్చి ప్రత్యక్షం అయి వరం కోరుకోమనగా శంభుడు తన అభీష్టం అయినా ప్రత్య క్షంగా పూజించే వరం కోరుకునాడు. భోళా శంకరుడు అంగీకరించి "ఇక్కడ లింగ రూపంలో వెలుస్తాను, నువ్వు జంబు వృక్ష రూపంలో ఉండి నన్ను పూజించు" అని చెప్పి అంతర్ధానం అయ్యాడట. శివుడు శంభుడికి ఇచ్చిన వరం ప్రకారం లింగంగా ఆవి ర్భించగా శంభుడు జంబు వృక్షమై శివుడిని అర్చిస్తుం టాడు. ఆలయ ప్రాంగణంలో ఉన్నజంబువృక్షమే శంభు డని భక్తుల ప్రగాఢ విశ్వాసం. మరో ఇతిహాసం ప్రకారం... ఇక్కడ స్వామి వారిని ఏనుగు, సాలెపురుగు పోటీపడి పూజిస్తుండేవి. సరిగ్గా శ్రీకాళహస్తి స్థలపురాణానికి సన్ని హితంగా ఉండే ఇతిహాసం ఇక్కడ

కూడా వినిపిస్తుంది. జంబుకేశ్వరం పవిత్ర కావేరి నది ఒడ్డున ఉన్నది. స్థానికులు ఈ నదిని 'పొన్ని' అని పిలుస్తారు. తమి శంలో పొన్ని అంటే 'బంగారం' అని అర్థం. ఇక్కడ కావేరి నదిలో స్నానం ఆచరించడం జంబుకేశ్వరుడిగా వెలసిన శివుడిని కొలవడం చాలా శ్రేష్ఠం అని ఇక్కడ స్థానికుల నమ్మకం. ఆలయం

విశేషాలు... ఇక్కడి దేవాలయం విశాలమైన ప్రాకారాలతో ఎత్తైన గోపురాలతో ఉన్నది. దేవాలయం ఐదు ఎకరాల విస్తీర్ణం, ఐదు ప్రాకారాలు కలిగి ఉన్నది. ఆలయానికి మొత్తం ఏడు గోపురాలు ఉన్నాయి. జంబుకేశ్వర స్వామి వారు పశ్చిమాభిముఖంగా ఉన్నారు. గర్భగుడి ప్రక్కన అఖి లాండేశ్వరి ఆలయం కూడా ఉన్నది. ఆలయ ప్రాకారంలో జంబుకేశ్వర స్వామి ఆలయం, అఖిలాండేశ్వరి ఆలయమే కాకుండా అనేక ఉపాలయాలు, అనేక మండపాలు ఉన్నాయి. గర్భ గుడి... జంబుకేశ్వ రుడిగా పేరుపొందినప్ప టికీ ఇక్కడి లింగం నీటితో నిర్మితమైంది కాని నీటిలో లేదు. లింగం పానపట్టం నుండి ఎల్లకాలం నీరు ఊరుతూ ఉంటుంది. ఈ విషయం భక్తులకు చూపించేందుకు లింగం పానపట్టం పై ఒక వస్త్రం కప్పుతారు. కొంతసేపటికి దానిని తీసివేసి ఆ వస్త్రాన్ని పిండుతారు. ఆ పిండిన వస్త్రం నుండి నీరు వస్తుంది. గర్భగుడిలో గవాక్షానికి నవద్వార గవాక్షం అని పేరు. గర్భాలయంలో ఉన్న జంబుకేశ్వరుడినే అప్పు లింగేశ్వరుడు, నీర్ తిరణ్ నాథర్ అని కూడా పిలుస్తారు.

అఖిలాండేశ్వరి ఆలయం... జంబుకేశ్వరస్వామి దేవేరి అఖిలాండేశ్వరి అమ్మవారు. ఈ అమ్మవారు చతుర్భుజా లతో

నిలబడిన భంగిమలో ఉంటారు, నాలుగు భుజాలలో పై రెండు చేతులతో కలువలు పట్టుకొన్నట్లు, క్రింది చేతులు అభయ హస్తంతో వరద ముద్రతో ఉన్నారు. అఖిలాండేశ్వరి అమ్మవారు పూర్వం చాలా ఉగ్రంగా ఉండేవారని శంకరా చార్యులు ఈమెను ఆరాధించి ఉగ్రాన్ని తగ్గించడానికి తపస్సు చేసి అమ్మవారిని ప్రసన్నం చేసుకొని శాంతమూర్తిగా మార్చారని చెబుతారు. అమ్మవారి ముందు కనిపించే శ్రీ చక్రాన్ని ప్రతిష్టించారని, అమ్మవారి కర్ణభూషణాలను కూడా శంకరాచార్యులవారే సమర్పించారని చెబుతారు. అమ్మవారి ఆలయానికి ఎదురుగా వినాయకుడు కొలువు దీరి ఉన్నాడు. ఇక్కడ వినాయకుడిని కూడా ఆదిశంకరులే ప్రతిష్ఠించారని ఇక్కడి వారి నమ్మకం.

ఆలయ చరిత్ర - నిర్మాణం... చారిత్రక ఆధారాల ప్రకారం ఈ ఆలయం శ్రీరంగంలో ఉన్న రంగనాథేశ్వర స్వామి ఆలయం కన్నా పురాతన మైనదని తెలుస్తోంది. క్రీ|| శ|| 11 వ శతాబ్దంలో చోళరాజులు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు, ఆ తరువాత ఆలయ నిర్వహణ పల్లవ రాజులు, పాండ్యులు, విజయనగర రాజులు చేసినట్లు తెలుస్తోంది.

పంచభూత క్షేత్రాలలో రెండవది జంబుకేశ్వరం. దేశంలోనే అతిపెద్ద, విశాలమైన దేవాలయంగా పేరుగాంచింది ఈ శైవక్షేత్రం. ఇక్కడ కొలువై ఉన్నది జల లింగం. జంబుకేశ్వరం తమిళనాడు రాష్ట్రంలోని తిరుచురాపల్లి జిల్లా కేంద్రానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఈ దేవాలయంలో మూర్తి జంబుకేశ్వరస్వామిగా ప్రసిద్ధి. ఈ స్వామికి దేవేరి అఖిలాండేశ్వరిపేరుతో విరాజిల్లుతోంది.

